# దేశంకోసం

మధ్యాహ్నం మూడు గంటలకి కాఫీ తాగి వీధివరండాలో వాలు కుర్చీలో పడుకుని పేపరు చూస్తున్న నేను ఎదురింటినించి ఒక్కసారిగా వినవచ్చిన ఏడ్పులకి తెల్లబోయాను. గతుక్కుమన్నాను. ఒక్కక్షణం ఆగి, ఇంకోసారి సరిగా విని ఆ ధ్వని మూర్తి యింటినించే అని దృఢపరచుకుని, వున్నవాణ్ని వున్నట్టైలేచి తడబడే అడుగుల్తో మూర్తి యింటికి బయలు దేరాను.

గుమ్మంలో అడుగు పెట్టగానే దృశ్యం చూసి నిశ్చేష్టుడినై పోయాను. గోడకి జారబడిపోయి, నేలమీదకూర్చున్న మూర్తి మూసిన కళ్ళనించి నీరుజారుతూంది. ప్రక్కనే మూర్తిభార్య రాజేశ్వరమ్మ స్పృహలేనట్టుగా నేలమీద పడివుంది. మూర్తి తల్లి ముసలావిడ పెద్దగా శోకాలు పెడ్తూంది. "నీకప్పుడే నూరేళ్ళు నిండిపోయాయిరా నాయనా, వద్దురాఅంటే ఆ పనికి పోయావుగదరా. నీ చావుకే వచ్చినట్టుంది ఈ యుద్ధం నాయనా గోపీ" అంటూ ఏడుస్తూంది. పురిటికి పుట్టింటికి వచ్చిన మూర్తి ఆఖరి కూతురు ఏడుస్తూనే తల్లిని పట్టుకు వోదారుస్తూంది.

అప్పటికే నాకు సంగతి అర్థమయింది. వెంటనే మూర్తి ప్రక్కకి వెళ్ళి "ఏమిటిరా మూర్తీ ఏమయిందిరా?" గాభరాగా అడిగాను. నా గొంతు విని ముసలావిడ గొంతు హెచ్చించింది. మూర్తి కళ్ళు తెరిచి బావురు

మన్నాడు. "గోపి గోపిరా" అస్పష్టంగా అంటూ పక్కనే పడివున్న గులాబిరంగు కాగితం అందించాడు. వణుకుతున్న చేతుల్తో టెలిగ్రాం విప్పాను. అది ఎయిర్‌ఫోర్సు అధికారుల వద్దనుండి: మీ కుమారుడు పైలెట్ ఆఫీసరు గోపీనాధరావు నిన్నటి యుద్ధంలో మరణించాడని తెలుపుటకు విచారిస్తున్నాం."

గోపీ! గోపి చనిపోయాడా? ఒక్కక్షణం ఏం తోచని దిగ్భ్రమలో ఉండిపోయాను గుండెలవిసేలా ఏడుస్తున్న ఆ తల్లిదండ్రులని ఏమని ఓదార్చాలో కూడా తెలియలేదు నాకు.

"ఎంత పని జరిగిందిరా మూర్తీ! యిలా అయిపోతాడని ఎన్నడూ అనుకోలేదు. ఎంత దురదృష్టం—యింత చిన్నతనంలోనే వాడికి నూరేళ్లు నిండిపోతాయని. మిమ్మల్ని యిలా దగాచేస్తాడని ..." పట్టుకున్నగొంతుతో ఏదో అన్నాను.

"గోపీ—గోపీ, యెక్కడున్నావు నాయనా, ఎంత చెప్పానురా వద్దురా ఈ పని నీకని....వినకుండా వెళ్ళి చేతులారా చావు కొనితెచ్చుకున్నావుగదరా....బాబు" మగవాడినని కూడా మరచి గుండెలు పగిలేలా దుఃఖించసాగాడు మూర్తి.

"ఊరుకో మూర్తీ ఎంత ఏడిస్తేమాత్రం పోయినవాడు తిరిగి వస్తాడా? కొంచెం ధైర్యం తెచ్చుకో. నీవే యిలా అయితే ఇంక ఆవిడ సంగతి ఏమిటి? కాస్త గుండె నిబ్బరించుకోవాలి" ఏదో పైకి ఓదార్పు మాటలు చెపుతున్నా నాకూ కళ్ళనీరు ఆగడంలేదు.

"ఇంతపని చేస్తాడని యెన్నడూ అనుకోలేదు. గోపీ! బాబూ! నాయనా" వాళ్ళ దుఃఖానికి అంతంలేదు.

మూర్తీ ఒకటి చెపుతున్నాను విను. నీ కొడుకు దేశంకోసం ప్రాణాలు అర్పించాడు అలాంటి ధీరుడిని కన్నందుకు నీవు గర్వించాలి... దేశరక్షణకోసం తన కర్తవ్యం నిర్వహించి, ప్రాణాలు అర్పించిన కొడు

కుని చూసి నీవు దుఃఖం మరచి గర్వించాలి" అంతకంటె ఏం చెప్పాలో నాకు అర్థంకాలేదు.

"నీకెలా తెలుస్తుందిరా నా బాధ. గుండెలు మండిపోతున్నాయి. కడుపుతీపి బాధ ఇలాంటి మాటలతో తీరుతుందా?"

"అవుననుకో నాకు తెలుసు నీబాధ అయినా కొంచెం ఓదార్పు చెందాలి. అంతకన్న చేయగలిగింది ఏముంది?"

మూర్తిభార్య రాజేశ్వరమ్మ ఇంతసేపటికి కళ్ళు తెరచింది. ఆ శోక మూర్తిని ఆ తల్లిని చూస్తుంటే గుండెలు ద్రవించాయి. "బాబూ గోపీ, నాయనా ఎక్కడున్నావు? ఎక్కడకు వెళ్ళిపోయావు నన్ను వదలి—ఒక్క సారి కనిపించు నాయనా. ఎంత బ్రతిమిలాడానురా నాయనా? నీకీ ఉద్యోగం వద్దని. వినకండా వెళ్ళి నన్నిలా అన్యాయం చేసి వెళ్ళిపోయావా? గోపీ" సంస్కారం అడ్డురాగా పెద్దగా ఏడ్వలేక కొంగు నోట్లో కుక్కుకొని కుళ్ళి కుళ్ళి ఏడ్వసాగింది.

"ఊరుకోమ్మా, ఊరుకో, మీకూ వాడికీ ఋణం చెల్లిపోయింది అంతే. ఇంక గుండె రాయిచేసుకోవాలి మీరు."

ముసలమ్మగారి శోకాలకి ఇరుగు పొరుగుచేరి ఎవరికి తోచినవిధంగా వారు ఓదార్చసాగారు. ఎన్నివిధాల ఓదారుస్తే, ఎన్ని స్వాంతవచనాలుచెపితే మాత్రం తీరేదా ఆ బాధ? ఉత్తిమాటలతో తీరుతుందా గర్భశోకం?

బాధ్యతలు, బరువులు అన్నీ తీర్చుకు నిశ్చింతగా వుండవలసిన ఈ వృద్ధాప్యంలో ఇంతటి కష్టం రావడం మూర్తి దురదృష్టం. రోజుకి ఎన్ని వందలమంది తల్లిదండ్రులు యీ విధంగా విలపిస్తున్నారో!

గోపీ చనిపోయాడన్న సత్యం నా మనసుని పిండసాగింది. పట్టు మని యిరవై రెండేళ్ళు లేని గోపీకి ఆయుస్సు అప్పుడే తీరిపోవడం ఎంత దౌర్భాగ్యం. గోపీని చిన్నతనంనుంచి ఎరుగుదును నేను. పొట్టినిక్కర్లు వీధిబడి చదువు పంతాలు, కాలేజి చదువు, ఎయిర్ ఫోర్సులో చేరడం

అన్నీ ఎరుగుదును నేను.

రామ్మూర్తి నాకు గాఢమిత్రుడేగాక, ఇద్దరికీ యెక్కడో దూరపు బంధుత్వంకూడా వుంది. ఇద్దరం ఒక ఊళ్లో పుట్టి పెరిగాం. ఇంటర్మీడియట్ వరకు సహపాఠకులం. ఇంటర్ తర్వాత మూర్తి ఇంజనీరింగుకు వెళితే నేను బియస్సీ. ఎమ్. ఎస్సీ చదివి, మూర్తి సూపర్నింట్ ఇంజనీర్‌గా నేను కాలేజి ప్రిన్సిపాల్‌గా రిటైరై మళ్ళీ యిద్దరం ఒకే ఊళ్ళో ఎదురెదురుగా ఇళ్ళు కట్టుకుని స్థిరపడ్డాం. మూర్తి పిల్లలందరూ పెద్దవాళ్ళయిపోయారు. ఆడపిల్లలందరికీ పెద్దసంబంధాలు చేశాడు. పెద్దకొడుకు చదువు తప్ప ఇంకోధ్యాస లేకుండా బుద్ధిగా చదువుకుని ఇంజనీరింగు ప్యాసై పెద్దఉద్యోగంలో ఉన్నాడు.

ఎటొచ్చీ మూర్తికి ఎప్పుడూ రెండో కొడుకు గోపి గురించే బెంగ. చిట్టచివర మూర్తికి వయస్సు మళ్ళాక పుట్టిన గోపీ గురించి ఊరికే బాధపడేవాడు.

గోపీది చిన్నప్పటినుంచి వింత స్వభావమే। కోపం, పంతం, తొందరపాటు అన్నీ ఒక పాలు యెక్కువే. ఎన్ని దెబ్బలుతిన్నా అన్న మాట మీదే నిలబడేవాడు. తనమాటే నెగ్గాలనేవాడు.

చిన్నప్పటినుంచీ గోపీ చదువుమీదకంటె ఆట పాటల మీద, మెకానిజంమీద ఇంటరెస్ట్ చూపేవాడు. బొత్తిగా చదువుమీద ధ్యాస లేకుండా వుండేవాడు. ఇంట్లో ఎప్పుడూ ఏ స్క్రూడ్రైవరో పట్టుకుని ఆ స్విచ్‌లు మార్చి ఇంకోటి బిగించడం. ప్లగ్గులు ఒకదానినొకటి మారుస్తూ వుండడం, రేడియో విప్పి ఆ వైర్లు తనిఖీ చేయడం. ఫేన్లు విప్పి ఆయిలింగ్ చేస్తూండడం. ఏ ఇస్త్రీ పెట్టో, హీటరో బాగుచేయడం, ఇలాంటి పన్లే చేస్తుండేవాడు. వాళ్ళ నాన్న లేనప్పుడల్లా కారు ఎక్కి ఆ వైర్లు బేటరీలు అవి ఎలా పనిచేస్తున్నాయో చూసేవాడు అన్నీ విప్పి చీవాట్లు తినేవాడు. పట్టుమని పదిహేనేళ్ళు లేకుండానే కారు డ్రైవింగ్ నేర్చుకున్నాడు ఇంక గేమ్స్. అందులో క్రికెట్ అంటే విపరీతమైన పిచ్చి. క్లాసులు ఎగగొట్టికూడ మేచ్‌లు ఆడుతూండేవాడు. సరే ఈ కాలపు

అందరి పిల్లల్లాగే సినిమాలపిచ్చి. రోజుకోమడత నలగని బట్టలకోసం యింట్లో వేధించడం అంతా సరేసరి.

గోపీ గురించి అస్తమానూ నా దగ్గర వాపోయేవాడు మూర్తి. "ఏమిటోరా వీడికి బొత్తిగా చదువుమీద ధ్యాసేలేదు. ఎలా పైకివస్తాడో వీడి వరస చూస్తుంటే బాగుపడే లక్షణాలు కన్పడడం లేదు. ఎంత చెప్పినా, ఎన్ని విధాల చెప్పినా వాడి కర్థం కావడం లేదు. ఏం చేయాలో బోధ పడడం లేదు" అంటూ ఒకటే బాధ పడేవాడు.

"ఆ ఇంకా కుర్రతనం. నాలుగు రోజులుపోతే వాడే తెలుసుకుంటాడు. పోనీ వాడి కిష్టమైన త్రోవనే వెళ్ళనిద్దాం ఏ మెకానికల్ ఇంజనీరింగో చదివించవచ్చు" అని ఏదో సర్ది చెప్పేవాడిని.

"ఆ వీడి మొహం, ఇంజనీరింగ్ కూడా చదువుతాడా వీడు, అంతవరకైనా వెళ్ళాలిగదా. వీడి చదువు వరస ఇలా వుంటే, ఏం పెద్ద చదువులు చదువుతాడు ....." నిస్పృహగా అనేవాడు మూర్తి.

ఆఖరికి అందరం అనుకున్నట్టుగానే మెట్రిక్ ఒకసారి తప్పి, ఇంటర్ బొటాబొటి మార్కులతో పాసు అయాననిపించుకుని, బి. యస్సీ రెండో సంవత్సరం పరీక్ష పోగానే ఇంక చదవనంటూ ఇంటికి వచ్చేశాడు గోపి. అందరూ ఎన్ని విధాలుగానో చెప్పారు. తల్లి బ్రతిమలాడింది. తండ్రి కేకలువేసి తిట్టాడు. అయినా యింక చదవనని మొండికెత్తాడు. తనకీ చదువుమీద ఇంటరెస్టు లేదని, ఎంత చదివినా తనకు రాదని, ఇష్టం లేని చదువులు చదివి ప్యాసు కాలేనని, తనకి ఎయిర్ ఫోర్సులో చేరాలని సరదాగా వుందని, దానికి ఈ చదువు చాలని అన్నాడు. తల్లి 'అది ప్రమాదమైన ఉద్యోగమని' వద్దని బతిమిలాడింది. మూర్తి చదవక పోతే నీఖర్మ, ముష్టెత్తుకో. నీ చదువుకి గుమాస్తా ఉద్యోగం తప్ప యింకేదిరాదు, నీ యిష్టం, ఆలోచించుకో" అని చీవాట్లు పెట్టాడు. ఎంత మంది ఎన్ని విధాల చెప్పినా వినలేదు.

ఆ రోజు మధ్యాహ్నం చేతిలో పేపరు పట్టుకుని గోపీ నా దగ్గరకి వచ్చాడు. "మీరేనా చెప్పింది బాబాయ్" అంటూ ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాను నేను.

"అదే. చూడండి బాబాయ్, నాకీ చదువు ఇష్టంలేదు అంటే ఇదే చదవ మంటారు నాన్నవాళ్ళు ..."

" చదవకపోతే ఏం చేస్తావు గోపీ !? పెద్ద చదువులు చదవకపోతే పెద్ద ఉద్యోగాలు ఎలా వస్తాయి ? "

"అదికాదు, ఇంటరెస్టు లేనిది, బలవంతంగా చేయిస్తే మాత్రం వస్తుందా. నాకు ఎయిర్ ఫోర్సులో చేరాలని ఎంతో సరదాగా వుంది. దాని కయితే ఈ చదువు చాలు, హాయిగా బోలెడు జీతం, లైఫ్ ఎన్‌జాయ్ చేయవచ్చు ... నే నెలాగూ పెద్ద చదువులు చదవలేను. పెద్ద ఉద్యోగాలు చేయలేను దీన్లో అయితే ఈ చదువుతోనే చాలాపైకి వెళ్ళి పెద్ద ఆఫీసర్ని అవగలను " ఉత్సాహంగా చెప్పుకు పోసాగాడు గోపి.

" కాని, ఎలాగైనా రిస్క్ జాస్తేనోయి ! అమ్మ, నాన్న భయపడ్డం సహజమేగదా," గోపి చిరాగ్గా నుదురు చిట్లించాడు. "మీరూ అలాగే అంటారేమిటి బాబాయ్. ఎంత మంది ఎయిర్ ఫోర్సు, ఉద్యోగాలుకి వెళ్ళడంలేదు. ఎంతమంది పెద్ద పెద్ద ఉద్యోగాలుచేస్తూ దర్జాగా లేరు. ఎయిర్ ఫోర్సులో జాయిన్ అయినంత మాత్రాన వెళ్ళిన వాళ్ళందరూ చచ్చిపోతారా ? మనకి ఆయుష్షు తిన్నగా వుంటే ఎక్కడుంటే మాత్రం ఏం ? అందరూ ఇలాగే అనుకుంటే యింక ఆ ఉద్యోగాలు చేసేదెవరు ? నాన్న ఇన్ని వేదాంత గ్రంథాలు చదువుతారు, అమ్మ భగవద్గీత వల్లిస్తుంది రోజూ. " మనిషికి చావు అన్నది ఒకసారేగాని ఇన్నిసార్లు రాదుగదా, ఆ చావు ఎక్కడున్నా వెంటాడుతుందన్న " సత్యం మీకందరికీ తెలిసే ఇలా అనవసరంగా ఎందుకు భయపడతారో నాకర్థం కాదు." గోపి ఆవేశంగా అన్నాడు.

నేను ఆశ్చర్యంగా గోపివైపు చూశాను. గోపికి యిన్ని తెలుసా? ఆశ్చర్యానందాలతో ప్రశంసా పూర్వకంగా చూశాను ఎంత చక్కగా చెప్పాడు!....

" ఏం కాదా బాబాయ్, నేను చెప్పింది నిజంకాదా? నాకు బతికే యోగంవుంటే, ఆయుష్షు తిన్నగా వుంటే, విమానాల్లో ప్రయాణం చేసినంత మాత్రాన చచ్చిపోతానా? ఇంకో ఉద్యోగంలో వుంటే ఆ చావు రాదా? హాయిగా పెద్ద జీతాల్తో జల్సాగా బ్రతకవచ్చు బ్రతికినన్నాళ్ళు .... చచ్చిపోతే ఏబాధ లేదు ... నా కెందుకో చాలా సరదాగా వుంది ఎయిర్ ఫోర్సులో చేరాలని, అమ్మ, నాన్న ఎంత మాత్రం వీల్లేదంటున్నారు. మీరైనా నచ్చచెప్పండి బాబాయ్."

"నిజమే గోపీ. చావు అన్నది యెక్కడున్నా, ఏవరూ తపించుకోలేరన్న సత్యం అందరికీ తెలిసినదే అయినా, వీలయినంత వరకు మృత్యుపరిసరాలకి దూరంగా వుండాలని అందరూ ఆరాటపడ్డం సహజమేగదా! ... పోనీ నీకెందుకు యింత పట్టుదల అమ్మ నాన్నలని అనవసరంగా నొప్పించడం యెందుకు, ... చక్కగా మీ అన్నయ్యలాగా నీవు ఏ ఇంజనీరింగుకో వెళ్ళి బుద్ధిగా చదువుకో కూడదా? "

"నాకీ చదువు వంట పట్టదని ఎన్నిమార్లు చెప్పినా మీరెవరూ ఎందుకు వినరు? మీరూ ఇలాగంటారని అనుకోలేదు. నాన్నకి నచ్చ చెప్తారన్న ఆశతో వచ్చాను" నిస్పృహగా అన్నాడు గోపి,

నాకు జాలి వేసింది. అంత ఉత్సాహంతో ఉన్నవాడిని నిరుత్సాహ పరచడం భావ్యం కాదనిపించింది. పోనీ దీన్లో అయినా పైకి వస్తాడేమో అనిపించింది.

"అలాగే, మీ నాన్నకి చెప్తాగాని, ఎయిర్ఫోర్సు సెలక్షన్ కూడ కష్టమే అనుకుంటాను, దానికి రిటెన్ టెస్ట్, సెలక్షన్లు, ట్రైనింగు అన్నీ వుంటాయి, నీవు నెగ్గ గలవా?"

"వో, అదెంత," ఉత్సాహంగా అంటూ పేపరు తెరిచాడు గోపి. "ఇదిగో చూడండి పర్మనెట్ రిక్రూట్ మెంట్ గురించి అడ్వర్టైయిజు చేశారు. వాళ్ళడిగినవన్నీ నాకు సరిపోతాయి" అంటూ చూపించాడు.

మొత్తానికి ఎలాగై తేనేం అనుకున్నది సాధించాడు గోపి నా బోధ వల్ల నేను ధైర్యం చెప్పడంవల్ల నై తేనేం,గోపి మొండి పట్టుదల వల్ల, నై తేనేం. కొడుకు ఎలాగూ పెద్ద చదువులు చదివే సూచనలు లేవు, ఈవిధంగా నైన పైకివస్తాడేమో అన్న ఆశ వల్లనై తేనేం, సగం అయిష్టంతోనే గోపి ఎయిర్ఫోర్సులో చేరడానికి వప్పుకునాడు మూర్తి

అసలు మూర్తి వాళ్ళ ఉద్దేశం "అ వీడి మొహం. వీడెలాగూ సెలక్టు అవడు. వాళ్ళే పనికిరారు పొమ్మంటె అప్పుడే మానుకుంటాడు" అని భావించారు, అదీకాక మూర్తికి విపరీతమైన నమ్మకం జాతకాలంటే। కొడుకు ఆయుష్షుకు అరవై యేళ్ళ లోపల ఏ ఢోకా లేదని, భయపడవల సిన అవసరం లేదని నచ్చచెప్పుకున్నాడు.

అందరం అనుకున్నట్టు గాక, గోపీ రిటన్ టెస్టులో ఫస్టులో వచ్చి, మంచి రేంకుతో సెలక్టు అయ్యాడు. అప్పుడుకూడా వాళ్ళమ్మ ఏడ్చి, వాళ్ళ నాన్న వద్దని బ్రతిమిలాడినా, ఇంక వింటాడా గోపీ.

చూస్తుండగానే ఏడాది ట్రైనింగ్ పూర్తి చేసి, పైలట్ ఆఫీసరు అయి, జెట్, హంటర్ల ట్రైనింగ్ కోర్సుకని, ఇంగ్లండు వెళ్లాడు గోపి, అప్పుడు మూర్తి భయపడి "జెట్ ట్రైనింగ్ ఎందుకు కోరావు. అది యింకా ప్రమాద మయినది గదా" అని రాస్తే "దీన్లో అయితే ఇంకా తొందరగా పైకి రావచ్చు, జీతాలు కూడా ఎక్కువ" అని రాశాడు గోపి. గోపికి ఎంత సేపూ ఎంత యెక్కువ సంపాదిస్తే అంత జల్సాగా ఖర్చు పెట్టుకోవచ్చన్న ఉద్దేశమే.

ఆరునెలలు ఇంగ్లండులో ట్రైనింగు పూర్తిచేసుకుని, ఇరవై రోజుల సెలవుమీద ఇంటికి వచ్చిన గోపిని చూసి అందరం ఎంతో ఆనందించాం. ఈ ఏణ్ణర్థంలో గోపీలో చాలా మార్పు వచ్చింది. బాగా పొడుగై

వళ్ళు వచ్చి రంగు వచ్చి నిండుగా వున్నాడు. డ్రస్సు వేసుకుంటే పెద్ద ఆఫీసరులా దర్జాగా వున్నాడు. పూర్వపు బాల్య చేష్టలు, అమాయకత్వం, అల్లరితనం పోయి హుందాతనం, మాట, మన్నన, మర్యాద అన్నీ వచ్చాయి. రోజుకో డ్రస్సు వేసుకొని, సూటు బూటుతో చకచక ఇంగ్లీషు మాట్లాడే గోపీని చూసి మూర్తివాళ్ళు పొంగిపోయారు. కొడుకు ప్రయోజకుడైనందుకు ఆనందించారు.

గోపీని చూసి వాళ్ళమ్మ సంతోషించినా "అసలే తొందర మనిషి, వెనకాముందు చూసుకోడు, ఎప్పుడేం చేస్తాడో" అని బెంగ పెట్టుకుంటూ మాట్లాడితే గోపి హేళనగా నవ్వి త్రోసి పారేశాడు. మీ రందరూ నన్నో చేతగాని వాడి క్రింద జమ కడ్తారుగాని నా అధికారులు, కోలీగ్స్ అందరు నన్నూ నా ఎఫిసెన్సీని ఎంత మెచ్చుకుంటారో తెలుసా! నీలాంటి వాళ్ళే ఏర్పోర్సుకి కావాలి అంటూ నా ధైర్య సాహసాల్ని పొగుడుతారు." అంటూ ఇంగ్లండులోనూ, ఇండియాలోను పై అధికారులు ఇచ్చిన యోగ్యతా పత్రాలు చూపించాడు.

"గోపి యీజ్ వన్ ఆఫ్ ది ఎఫిసెంట్ పైలట్స్" అన్న సర్టిఫికేట్లు చూపాడు. గోపీ యింత ప్రయోజకుడయినందుకు ఎంతో ఆనందించాం అందరం.

గోపిని చూశాక "ఒక్కొక్కరికి ఒక్కొక్క లైనులో ప్రవీణ్యత, ఇంటరెస్టు వుంటుంది. మనం అది గుర్తించి మనం వాళ్ళని ఆ త్రోవనే వెళ్ళటానికి ప్రోత్సహిస్తే ఎంతవారేనా అవుతారనిపించింది.

గోపి యిరవై రోజుల సెలవు గడిపి డ్యూటీలో జాయిన్ అయిన నెలరోజుల కూడాకాకముందే పిడుగులాంటి వార్త—పాకిస్తాన్‌తో యుద్ధం ఆ వెంటనే గోపీ నించి వుత్తరం-తనని ఫ్రంట్‌కి పంపిస్తున్నారని, రేపే బయలుదేరి వెళ్ళాలనీ, తన కోసం భయపడవద్దనీ, ఆదుర్దాపడవద్దనీ నాలుగు లైన్లు రాశాడు ఇంటికి.

అది చూసి మూర్తి వాళ్ళు చాలా ఆదుర్దా పడ్డారు. అనుక్షణం ఎలాంటి వార్త వినవలసి వస్తుందోనన్న చింతతో గడిపేవారు. రోజుకి

ఎన్ని విమానాలు కూలిపోతున్నది, ఎంతమంది చనిపోతున్నది విని బెంగతో సతమత మయ్యేవారు. అసలే తొందర మనిషి. మొండి ధైర్యం, ఏంచేస్తాడో అని నా దగ్గర వాపోయేవాడు మూర్తి.

"మరేం ఫరవాలేదు. గోపికి చాకచక్యం. ధైర్యం అన్నీవున్నాయి" అని ధైర్యంచెప్పినా నేనుకూడా. గోపి ఏ ముహూర్తాన ఈ ఉద్యోగంలో చేరేడో కాని ఈ యుద్ధం కూడా ఇప్పుడే రావాలా అని బాధపడేవాడిని.

గోపి ఫ్రంట్‌కి వెళ్ళిన వారం రోజులకి ఓ వుత్తరం వచ్చింది. అతని తల్లికి ఎంత చక్కగా రాశాడో। నాకు చూపించి గర్వంతో పొంగిపోయాడు మూర్తి.

"అమ్మా."

నేను క్షేమంగా వున్నాను. నా గురించి మీరేం భయపడకండి. నాకే ప్రమాదం జరుగదు. క్షేమంగా, విజయంతో తిరిగి వస్తాను. మీరు అనవసరంగా దిగులుపడకండి.

అమ్మా, నిజంగా నాకెంత ఆనందంగా వుందో తెలుసా యిప్పుడు। ఈనాటికి నేనూ దేశానికి ఏ కొంచెమైనా ఉపయోగపడ్తున్నందుకు—నాకు ఎంతో తృప్తిగా వుంది. చూశారా మీరు అప్రయోజకుడనుకునే మీ కొడుకు ఈ నాటికి ప్రయోజకుడై దేశానికి సేవచేస్తున్నాడు.

అమ్మా। దేశరక్షణకి తోడ్పడడంలో, దేశంకోసం ప్రాణాలు త్యాగం చేయడంలో యింతటి అనిర్వచనీయమైన ఆనందం వుందని నేనెన్నడూ అనుకోలేదు సుమా! మేమందరం - అంటే నేనూ, నా సహోద్యోగులు ఎంతో ధైర్యసాహసాలతో పోరాడుతున్నాం శత్రువులతో। మాలో ఏ ఒకరికీ ప్రాణభయం లీలామాత్రంగానైనా కలుగక పోవడం మాకే ఆశ్చర్యంగా వుంటుంది.

ప్రతి ఒక్కరం ఫ్లయిట్‌కి వెళ్లేముందు ఎంతో ఉత్సాహంతో ఒక్కొక్కరం ఏన్నేసి శత్రు విమానాలు కూల్చగలమా, శత్రువుకి ఎంత నష్టం కలిగించగలమా అన్న ఆలోచన తప్ప, మాకేమైనా ఆపద వస్తుం

దేమోనన్న అనుమానమేలేదు. ఏ క్రికెట్ ఆటో ఆడుతున్నంత ఉత్సాహంగా ఒక్కొక్కరం ఎన్నేసి వికెట్లు పడగొట్టగలమా అన్నట్టుగా ఒక్కొక్కరం పంతాలు వేసుకుని మరీ రణరంగంలోకి దుముకుతున్నాం. ఒకవేళ కర్తవ్య నిర్వహణలో మాలో ఎవరికైనా ఆపద సంభవించినా, మరణం సంభవించినా, తాత్కాలికంగా తోటి ఉద్యోగిని పోగొట్టుకున్నందుకు బాధపడ్డా, దేశం పట్ల తమ కర్తవ్యం నిర్వహించి, వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన ఆ ధీరుని అడుగుజాడల్లో మేమూ నడవాలని నిశ్చయించుకుని నూతనోత్సాహంతో శత్రువులని చీల్చి చెండాడాలన్న ఆవేశంతో వీర విహారం చేస్తున్నాం.

మేమందరం దేశంకోసం ప్రాణత్యాగం చేయటానికి సిద్ధంగా వున్నాం, విజయానికి మా శక్తివంచనలేకుండా తోడ్పడుతున్నాం. అంతిమ విజయం మనదే అన్న ధైర్యం మాకుంది.

అమ్మా, నేను రెండు శత్రు విమానాలు ధ్వంసం చేశాను తెలుసా! ప్రపంచ ఖ్యాతిగాంచిన శాబర్ జెట్ విమానాలని, మన భారత దేశంలో తయారయిన విమానాలతో ఒక్కొక్కటి ఒక్కొక్క దెబ్బకి నేలకూల్చాను. ఎయిర్ మార్షల్ నాతో కరచాలనం చేసి "వెల్‌డన్ బాయ్" - అని ప్రశంసించారు. డిఫెన్స్ మినిష్టర్ నా భుజం తట్టి ఆప్యాయంగా ప్రశంసించి అప్పటికప్పుడే "మహావీర చక్ర" బిరుదు ప్రసాదించబోయేట్టు తెలిపారు ఆనందంతో నావళ్లు పులకరించింది. కళ్ళు చెమర్చాయి. ఇలాంటి దేశంకోసం ప్రాణాలు అర్పిస్తేమాత్రం ఏమనిపించింది ? నా ఆనందంతో పాలుపంచుకోడానికి మీకు రాస్తున్నాను. ఈ నాటికి నా జన్మ తరించినట్టనిపించింది.

అమ్మా, కర్తవ్య నిర్వహణలో, ఒక వేళ నా కేదయినా సంభవిస్తే మీరెంతమాత్రం విచారించకూడదు. దేశంకోసం ప్రాణాలు అర్పించిన కొడుకుని చూసి మీరు గర్వించాలి!

రెండు విమానాలు కూల్చినందుకు నా కివాళ ఆఫ్. మళ్ళీ యింకో ఫ్లైటుకి రేపో, ఎల్లుండో వెడతాను. వీలయినంత వరకు శత్రువుకి నష్టం కలిగించాలన్న ఆరాటం నాలో చాల ఎక్కువగా వుంది. నా శక్తి వంచన లేకుండా విజయానికి తోడ్పాటు పడుతాను.

ఇవాళ తీరికగా నా ఆనందాన్ని వెల్లడించుకోవాలని మీకీ ఉత్తరం రాశాను. చాల పెద్ద ఉత్తరం రాశాను గదూ! మళ్ళీ తర్వాత ఇంకో ఉత్తరం రాస్తాను. ఇంక వుంటాను, జై హింద్!"—గోపి.

ఆ ఉత్తరం చూసి గోపి ధైర్యసాహసాలకి, అంతటి ఘనకార్యం చేసినందుకు ఆనందించాం.

ఆ ఆనంద పారవశ్యం అణగకముందే తరవాత మూడు రోజులకే యింతటి ఘోరవార్త వినవలసి వస్తుందని కూడ అనుకోలేదు.

గోపిలాంటి ధీరుడు చనిపోవడం ఎంత దురదృష్టం! ఎంతమంది తల్లిదండ్రుల కడుపులో చిచ్చుపెట్టడానికి, ఎంతమంది భార్యాబిడ్డలు కన్నీరు కార్చడానికి వచ్చిందో ఈ యుద్ధం! ఎన్ని రక్తపాతాలు జరగాలో ఎంత మంది తమ ప్రాణాలు బలిపెట్టాలో!

మూర్తి యింటినించి అప్పుడప్పుడు హృదయవిదారకంగా ఏడుపులు వినిపిస్తున్నాయి యింకా! ఎన్ని వేలమంది ఇలా దుఃఖిస్తున్నారో!

* * *

మర్నాటి పేపరులో గోపి మరణవార్త విశదంగా తెలిసింది. ఆరోజు ఫ్లైటుకి వెళ్ళి ఒక శత్రు విమానానికి నష్టం కలిగించి తిరిగి బేస్‌కి వస్తూండగా ఇంకో శత్రు విమానం కురిపించిన బాంబులకి గోపి ప్లేన్ దగ్ధమై కూలిపోయిందట. ప్లేనుతోపాటు గోపి కూడ మంటలకి ఆహుతి అయిపోయినట్టు, అతని ధైర్యసాహసాలకి మెచ్చి ప్రభుత్వం "మహావీరచక్ర" బిరుదు ప్రసాదించినట్టు వార్త వచ్చింది.

అది చూసి మూర్తి వాళ్ళు గొల్లుమని ఏడ్చారు. పాపం ఆఖరికి శవాన్నయినా కళ్ళచూసే యోగ్యం లేకపోయింది "నీవులేని నీయీ బిరుదులు ఎందుకు నాయనా, ఏం చేసుకోం? గోపీ గోపీ" అంటూ గుండెలు పగిలేలా రోదిస్తుంటే వాళ్ళని చూసి రాళ్ళు సయితం కరుగక మానవు.

ఇంటినిండా కూతుళ్ళు, అల్లుళ్ళు ఆప్తులు, బంధుజనం, అంతమందిలో గోపిలేని వెలితి, ఇంక పూడలేని వెలితి అని మరింత బాధపడేవారు.

— చూస్తుండగానే పన్నెండు రోజులు అయిపోయాయి. పన్నెండో రోజున వూరి పెద్ద లందరూ మూర్తి అధ్వర్యాన వూళ్ళో సంతాప సభ ఏర్పాటు చేశారు. సభలో గోపిలాంటి ధీరుడు తమ వూరివాడు కావడం తమకు గర్వకారణం అన్నారు. దేశంకోసం ప్రాణాలర్పించిన, అంతటి ధీరుని కన్న ఆ తల్లి దండ్రులు ధన్యులన్నారు. అందరూ గోపిని, గోపి ధైర్యసాహసాలని ప్రశంసించారు. గోపి ఫొటో ఒకటి ఆవిష్కరించి, పూలమాలలువేసి వూరంతా ఆర్భాటంగా వూరేగించారు. గోపి తల్లి తండ్రులకి తమ సంతాపాన్ని తెలిపారు. — అదంతా చూస్తూంటే మనిషికి బ్రతికి వున్నప్పటికంటె చనిపోయేకే ఎక్కువ విలువ, ఎక్కువ కీర్తి ప్రతిష్టలు లభిస్తాయన్న సత్యం కళ్ళారా చూసాను. ఒకప్పుడు తల్లిదండ్రులు సయితం ఎందుకూ పనికిరాడనుకున్న ఆ గోపీనే, ఈ నాడు ఇంత మందిచేత ఇన్ని ప్రశంసలు అందుకుంటున్నాడనిపించింది.

రోజులు దొర్లిపోతున్నాయి. ఆఖరికి యుద్ధ మాగిందన్న వార్త అందరికీ శాంతి కలిగించింది. రక్తపాతాలు ఆగినందుకు అందరూ ఆనందించారు.

గోపి పోయి రెండునెలలు అవుతూంది ఈ రెండు నెలలలోనూ మూర్తి దంపతులలో ఎంతోమార్పు వచ్చింది. జీవచ్ఛవాలలాగా, దైన్యంగా బ్రతుకక తప్పదన్న వైరాగ్య ధోరణిలో రోజులు జరుపుతున్న వాళ్ళనీ, వాళ్ళ దుఃఖాన్ని కాలగతే మార్చాలి!

యుద్ధంలో అమిత ధైర్య సాహసాలు చూపి ప్రాణాలు అర్పించిన వారికి, యుద్ధంలో వీరకృత్యాలు చేసినవారికి ప్రభుత్వం, వారి ధైర్యసాహసాలను గుర్తించి బిరుదులు ఇచ్చి సత్కరించడానికి నిశ్చయించుకుంది. ఆ బిరుదులను అందుకోడానికి రావలసినదని అందరికి ఆహ్వానాలు వెళ్ళాయి. మూర్తికికూడ "చనిపోయిన తమ కుమారుని తరపున "మహావీరచక్ర" బిరుదును అందుకోడానికి ఢిల్లీ రావలసినదని ఆహ్వానం పంపింది ప్రభుత్వం.

అది చూసి మూర్తి పేలవంగా, విషాదంగా నవ్వాడు. "నాకెందుకురా, వాడు లేచి యీ బిరుదులు, గౌరవాలు నాకెందుకు, ఏం చేసుకోను, ఫొటోకట్టించుకోనా ? అది చూస్తున్నప్పుడల్లా మరింత బాధ. నాకక్కర లేదు. నే వెళ్ళను" అన్నాడు.

"ఇంతటి గౌరవం పొందగలగడం సామాన్యంకాదు. అందరికి ఇంత అదృష్టం లభించదు. నీ కొడుకు లేకపోయినా వాడికి లభించిన కీర్తి ప్రతిష్ఠలు నీవికావా ? నీవు అలాంటి కొడుకుని కన్నందుకు గర్వించాలి. తప్పకుండా నీవు ఢిల్లీ వెళ్ళవలసిందే ..." అని ఎంతో నచ్చచెప్పి. బలవంతంగానే ఢిల్లీ పంపించాను.

వారం రోజుల తర్వాత ఢిల్లీనించి వచ్చిన మూర్తిని చూసి ఆశ్చర్యపోయాను. మూర్తిలో విపరీతమైన మార్పు వచ్చింది. పూర్వపు విచారపు దుఃఖపుచ్ఛాయలు మచ్చుకయినా కనపడలేదు. వాటిస్థానే మొహంలో కాంతి, కళ్ళలో తేజస్సు, అన్నిటిని మించిన ఏదో అవ్యక్తమైన దృఢత్వం కన్పించింది. మాటలలో, చేతలలో, రూపులో,నే నాశ్చర్యపడి అడిగే లోపల తనే ఎంతో ఉత్తేజితుడై చెప్పడం మొదలు పెట్టాడు.

"నేను నిజంగా ఢిల్లీ వెళ్ళడం చాలా మంచిపని అయింది సుమా, వెళ్ళకపోయుంటే ఎన్నాళ్ళకీ మామూలు మనిషిని కాలేక పోయేవాడిని. అక్కడికి వెళ్ళి నాలాంటివారిని చాలామందిని చూశాక నాకు జరిగిన నష్టం స్వల్పమే అనిపించింది. ఏదోవూరట కలిగింది, ఉన్న ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకున్న పండు వృద్ధ మాతలను, ఏకైక పుత్రుని దేశా

నికి అర్పించిన తండ్రులను, పెళ్ళయిన కొద్దిరోజులలోనే భర్తలను కోల్పోయిన అభాగినులలను, తండ్రిప్రేమ కరువైన పసిపాపలుగల తల్లులను.. వీరందరిని చూస్తుంటె నేనింకా కొంతలో కొంత అదృష్టవంతుడనే అనిపించింది.

అందులో ఒక పండు ముసలి, ఎనభై ఏళ్ళ ఏక్స్ సర్వీసుమెన్-ఇదివరకు ఒక కొడుకు చైనా యుద్ధములో చనిపోయాడట. ఇప్పుడు మిగిలిన ఆ ఒక్కకొడుకు కూడా చనిపోయినా కూడా ఎంతో నిబ్బరంతో "నాకు దక్కని అదృష్టం నా కొడుకులకు దక్కినందుకు గర్విస్తున్నాను. దేశంకోసం ఈ కొంచెం సేవ చేయగలిగినందుకు గర్విస్తున్నా నన్నాడు" అతని దేశభక్తికి గుండె నిబ్బరానికి అందరూ జోహారు అర్పించారు.

ఇంకో కెప్టెన్ భార్య పాపం వివాహమైన ఆరు నెలలకే భర్తని పోగొట్టుకున్న అభాగ్యురాలు, భర్తతరపున "వీర చక్రము బిరుదును అందుకోడానికి వచ్చి తనకు కలిగిన వ్యక్తిగత నష్టం ఎంత బాధాకరమైనదైనా, ఎవరూ పూడ్చలేనిదయినా అంత ధీరుడిని భర్తగా ఆరునెలలైనా పొందగలిగి నందుకు దేశంకోసం ప్రాణాలర్పించిన వీరుడి భార్యనని చెప్పుకోడానికి గర్విస్తున్నానని కన్నీటితో పత్రికా విలేఖరులతో చెప్తున్న ఆమెను చూస్తే అందరి హృదయాలు ద్రవించాయి.

ఇంకొక వృద్ధమాత ఏకైక ఆధారమైన కొడుకుని వృద్ధాప్యంలో పోగొట్టుకున్న ఏకాకి అయికూడా పుత్రమరణం తనని ఎంత దహిస్తున్నా, గర్భశోకం ఎంత కృంగదీస్తున్నప్పటికీ ఒక మంచి కార్యం కొరకు, దేశం కొరకు. దేశ రక్షణకొరకు తన పుత్రుని అర్పించినందుకు ఆనందిస్తున్నానని, వీరమాత అనిపించు కొన్నందుకు గర్విస్తున్నానని అటువంటి పుత్రుని. గన్న తన జన్మ ధన్యమయినదని భావిస్తున్నానని చెప్పింది. కుమారుని తరపున "మహావీర చక్ర" బిరుదు అందుకొనడానికి వచ్చింది.

ఇంకొక మేజరుభార్య నలుగురు పసిపాపల తల్లి తనభర్త మరణం తనకి వ్యక్తిగతంగా యెంత నష్టం కలిగించినా, యెంత కృంగదీస్తున్నా భర్త అడుగుజాడల్లో అతని ఆశయాలకు అనుగుణంగా, ఈ పసిపాపలను

పెంచి పెద్దచేసి వీరులుగా దేశసేవకే వినియోగించడం తన లక్ష్యం అని చెప్పింది.

ఇలాగే ప్రతిఒక్కరు బహుమతిని అందుకొనడానికి వచ్చి అందరూ తమ తమ వ్యక్తిగత నష్టాలకి విచారిస్తున్నా దేశంకొరకు తనవారిని అర్పిస్తున్నట్లు మాట్లాడారు. ఇంకా వీరు తెరమీదవారు మాత్రమేనని, తెరవెనుక ఇలాంటివారు వేల మంది వున్నారన్న నిజం గుర్తించి, ఒక్క నేనే అంత ధీరుడైన కొడుకుని కని కూడా ఇంత బేలగా దుఃఖిస్తున్నా ననిపించింది.

రాష్ట్రపతి నుండి బహుమతి అందుకుంటూంటె చేతులు వణికాయి స్వయంగా గోపి అందుకుంటుంటె చూచేయోగం లేదనిపించింది.

బహుమతి ప్రదానం తర్వాత రాష్ట్రపతి చెప్పినట్టు " ఈ నాడు దేశంకొరకు ప్రాణత్యాగం చేసిన వారిపేర్లు చరిత్రలో చిరస్థాయిగా వుంటాయని, వారెన్నటికి చిరస్మరణీయులని, వారి త్యాగం ప్రజలెప్పుడూ గుర్తిస్తారని అట్టివారిని కన్నతల్లిదండ్రులు ధన్యులని, అట్టివారిని చేపట్టిన స్త్రీలని అభినందిస్తూ, వారికి జరిగిన వ్యక్తిగత నష్టానికి నా సంతాప సానుభూతులు" అన్నారు.

ఆ మాటల్లో ఎంత నిజం వుంది! గోపి చనిపోతేనేం వాడిపేరు చిరస్థాయిగా వుంటుంది. చిన్నవాడైన పెద్దచావు పొందకలిగి అందరి చేత మన్ననలు అందుకుంటున్నాడు. బ్రతికినది కొద్దికాలమయినా తన జీవితానికి సార్థకత చేకూర్చుకున్నాడు. ఒక మంచిపని చేశానన్న తృప్తితో చనిపోయాడు. ఎందుకూ మనం అరవయ్యేసి ఏళ్ళు బ్రతికాం; బ్రతుకుతున్నాం. మన యీ జీవితం ఒక్క మంచికార్యం. నలుగురి చేత అవుననిపించుకునే పని, అంతదాక ఎందుకు మన మనసుకి తృప్తి నిచ్చేపని ఒక్కటైనా చేశామా ! ఎందుకు ఎన్నాళ్ళు బ్రతికితేనేం ? బ్రతికినది కొద్దికాలమైన గోపి చరిత్రలో చిరస్థాయిగా చిరస్మరనీయుడుగా నిల్చి పోయేటట్టు చేసుకున్నాడన్న నిజం గుర్తించాక మనసు తేలిక పడింది. అలాంటి సుపుత్రుడిని కన్న నేను ఇంక అవివేకముగా దుఃఖించడంలో అర్థం లేదనిపించింది.

దేశంకోసం నా కొడుకుని అర్పించానన్న తృప్తితో నా దుఃఖాన్ని మరచిపోవడానికి నిశ్చయించుకున్నాను. గోవి అమ్మతో గూడా ఇదే చెప్పాను. గోపి గురించి ఇంక బాధపడను వెర్రిగా।" దోపి అనిర్వచనీయమైన అనుభూతి కళ్ళలో ద్యోతక మవుతూంటే ఆవేశంగా చెప్పిన మూర్తి మాటలకి, మూర్తిలోని మార్పుకి నేనెంతో ఆశ్చర్యపోయాను.

నిజమే। 'చావన్నది ఒక్కసారే గదా వస్తుంది' అన్న నిజం గుర్తించి ధైర్యంగా వెళ్ళి దేశంకోసం ప్రాణత్యాగం చేయడంలో ఎంతటి ఆనందం, తృప్తి వుంటుందో అనుభవించినవారికి గాని తెలియదేమో ।

---

(మము వీడిపోయిన సోదరుడు పైలట్ ఆఫీసరు గోపి స్మృతికి అంకితం)